క్లుప్తంగా

నేడు దివంజీపేటకు స్పీకర్ రాక

ఆమదాలవలస రూరల్: దివంజీపేట గ్రామంలో స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ఉదయం పర్యటించనున్నారు. ఇందులో భాగంగా జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు స్పీకర్ శంకుస్థాపన చేస్తారని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కుమ్మరిపేట, సైలాడ గ్రామాల్లో కుళాయిలను ప్రారంభిస్తారన్నారు.

ప్రైవేటు స్కూల్ డైరెక్టర్ మృతికి సంతాపం


శ్రీరాములు (ఫైల్)

పోలాకి: పిన్నింటిపేట అరుణోదయ స్కూల్ డైరెక్టర్ హనుమంతు శ్రీరాములు (58) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ప్రియాగ్రహారానికి చెందిన ప్రగతి స్కూల్ డైరెక్టర్ గణపతిరావుతో కలసి ఓ ఫంక్షన్‌కు వెళ్లి బైక్‌పై తిరిగివస్తూ మొగిలిపేట వద్ద రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో సమీపంలోని పోలాకి పీహెచ్‌సీకి శ్రీరాములును తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీరాములు మృతిపై రాష్ట్ర ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట జనార్దనరావు తదితరులు సంతాపం తెలియజేశారు.

గ్రామాల్లో సత్సంగాలు నిర్వహించాలి


ప్రవచనం చేస్తున్న జ్యోతి స్వామి

సారవకోట: గ్రామాల్లో సత్సంగ కార్యక్రమాలు నిర్వహించాలని పొందూరుకు చెందిన జ్యోతి స్వామి అన్నారు. బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో సత్సంగమ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్సంగ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలన్నారు. బుడితి, కిన్నెరవాడ గ్రామాల్లో ప్రతి నెల ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడంతో శుభపరిణామమన్నారు. బగాది రామారావు, అల్లు రామయ్య తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. కార్యక్రమంకు హాజరైన భక్తులకు చిన్నాల మాధవరావు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. జాడ మోహనరావు, మెండ సన్యాసిరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


లింగాలవలసలో మొక్క నాటుతున్న సాయి భక్తులు

జలుమూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. లింగాలవలస, చల్లవానిపేట గ్రామాల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా కోటి మొక్కలు నాటనున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మణరావు, సేవాదల్ ఇన్‌చార్జిలు రామచంద్రరరావు, అమ్మాయమ్మ, ప్రేమతరుణ్, చంద్రమౌళి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నరసింహమూర్తి, .ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాదగుప్త, జిల్లా యువత ఇన్‌చార్జిలు శివకుమార్, సాయిరోహిత్, నిఖిల్‌తోపాటు చల్లవానిపేట, లింగాలవలస సాయిభక్తులు పాల్గొన్నారు.

రూ.93 లక్షలతో నాడు-నేడు పనులు


నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలోని ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాడు-నేడు రెండో విడత పనులు జోరుగా జరుగుతున్నాయి. రూ.93.94 లక్షలతో ఎనిమిది అదనపు తరగతి గదులు మంజూరైనట్టు ఐటీడీఏ డీఈఈ బి.శిమ్మన్న ఆదివారం తెలిపారు. గత ఏడాది నుంచి ఇంటర్ కూడా నిర్వహించడంతో అదనపు తరగతి గదులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం శ్లాబ్ హైట్ పిల్లర్లు వేసే పనులు చేపడుతున్నాయి.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- తొమ్మిది పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాలు
- రూ. మూడు కోట్లతో అభివృద్ధి పనులు
- రూ. 45 లక్షలతో ల్యాబ్ పరికరాలు ఏర్పాటు



జలుమూరు పీహెచ్‌సీ

జలుమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు సమకూర్చుతున్నారు. దీంతో ఇక్కడకు వివిధ సమస్యలతో వచ్చే రోగులకు కార్పొరేట్‌స్థాయి వైద్యం అందుతోంది. అధునాతన యంత్ర పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. అలాగే మందుల కోసం గతంలో కంటే ఎక్కువ బడ్జెట్ కేటాయించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మహర్దశ పట్టింది. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులతోపాటు అవసరమైన సాంకేతిక, ఇతర సిబ్బందిని సైతం నియమించారు. నరసన్నపేట నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది పీహెచ్‌సీలకు సుమారు రూ. మూడు కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసి పూర్తిస్థాయి మౌలిక వసతులు సమకూర్చారు. అలాగే ల్యాబ్‌కు సంబంధించి రూ.45 లక్షలతో కొత్తగా సెమీ ఆటో బయోకెమిస్ట్రీ, ఎలోక్ట్రా ఎనలైజర్, యారిన్‌స్ట్రిప్ రీడర్, హెమటాలజీ ఎనలైజర్ వంటివి పరికరాలను పీహెచ్‌సీలకు సమకూర్చారు. వీటితో మధుమేహం, హెచ్‌బీ, హెచ్‌ఐవీ, బ్లడ్ గ్రూప్, సిఫిలిస్, టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, వి.డి.ఆర్.ఎల్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో ఇక్కడకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. గతంలో నెలకు సుమారు 12 వందలమంది వైద్యం కోసం వస్తే ప్రస్తుతం రెండువేలకు పైగా పెరిగింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. పీహెచ్‌సీలు, ప్రధాన ఆస్పత్రులతోపాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా కూడా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ల్యాబ్‌కు వచ్చిన కొత్త పరికరాలు

సమకూరిన మౌలిక వసతులు



నాడు-నేడు పథకం ద్వారా పీహెచ్‌సీలకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పూర్తిస్థాయిలో మౌలిక వసుతులు సమకూరాయి. అవసరమైన వారికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నాం. మందులకు బడ్జెట్‌లో అధిక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంది. పీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది.

– తాదేల శ్రీకాంత్, మెడికల్ అధికారి, జలుమూరు

వైద్య సేవలు బాగున్నాయి



గతంలోకంటే పీహెచ్‌సీల్లో వైద్య సేవలు బాగున్నాయి. చిన్నపాటి జ్వరంతో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే అన్ని పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు ఇస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదు. చిన్న గాయమైనా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

-మెరుగు రమా, సైరిగాం

రైతులకు రుణాలు అందించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే వ్యవసాయ, ఇతర అనుబంధ రుణాలపై తక్షణం స్పందించాలని బ్యాంకర్లకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఆదివారం వెదుళ్లవలసలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం కృష్ణదాస్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాల ద్వారా రైతులను ఆదుకుంటుందన్నారు. బ్యాంకర్లు కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా డీసీసీబీ ఇచ్చే రుణాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని చైర్మన్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చేరువ చేయడానికే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: అర్హులందరికీ శతశాతం ప్రభుత్వ పథకాలను అందజేయాలనే లక్ష్యంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని.. అందుకుగాను జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ చరిత్రలోనే రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అర్హత ఉండి ఏ కుటుంబం అయినా ఫలానా పథకం అందలేదని చెప్పే అవకాశం ఉండకూడదనే ధ్యేయమన్నారు. అందులో భాగంగా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అర్హులైన వారిని గుర్తించి పథకాలే కాకుండా సచివాలయాల ద్వారా తొమ్మిది రకాల సర్టిఫికెట్లను అందజేయటమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తూ ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష అని అన్నారు. కార్యక్రమం విజయవంతంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ !


ప్రభుత్వ స్థలంలో మట్టి వేసిన దృశ్యం

నరసన్నపేట: నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని పైడితల్లి కూడలికి వెళ్లే మార్గంలో విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణపై పలువురు దృష్టి పెట్టారు. లక్షలాది రూపాయల విలువైన భూములను ఆక్రమించి తమ పబ్బం గడుపు కోవడానికి కొందరు చూస్తున్నారు. దీంట్లో భాగంగా శిధిల భవనాల మట్టిని రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో వేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే మట్టి కప్పిన స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ మార్గంలో కొంత ప్రభుత్వ స్థలాన్ని వివిధ కార్మిక యూనియన్లకు అనధికారికంగా ఐదేళ్ల క్రితం అధికారులు ఐదేళ్ల క్రితం ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ సెంటు రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షలు ఉంది. ఇదే అదునుగా తీసుకొని కార్మిక భవనాలకు ఆనుకుని ఉన్న భూమిని అన్యాక్రాంతం చేయాలని ఆక్రమణదారులు పన్నాగం పన్నుతున్నారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి తగు చర్యలు చేపట్టి ఆక్రమణలు అడ్డుకోవాలని, వేసిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ ఈవో సింహాద్రినాయుడు వద్ద ప్రస్తావించగా ఇప్పటికే ఆక్రమణల సమాచారం తహసీల్దార్ దృష్టికి వెళ్లిందన్నారు. మట్టి వేయకుండా అడ్డుకున్నట్టు చెప్పారు. స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ అన్వేష్ వద్ద ప్రస్తావించగా.. మట్టి వేస్తున్న వ్యక్తిని గుర్తించి హెచ్చరించామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నీలమణిదుర్గ ఆలయానికి భక్తుల తాకిడి


నీలమణిదుర్గకు పూజలు చేస్తున్న చంద్రశేఖర్

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మేళతాళాలతో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. కాగా అమ్మవారిని జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈవో టి.వాసుదేవరావులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం నీలకంఠేశ్వర స్వామి వారిని కూడా దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ముఖలింగ ఆలయం ఈవో ప్రభాకరరావు, రిటైర్డు ఈవో రమణయ్య, సవిరిగాన కృష్ణారావు, ఆలయ గుమస్తా సుదర్శనరావు, అర్చకులు పాల్గొన్నారు.

పరశురామ అవతారంలో జగన్నాథస్వామి


సారవకోట: పరశురామవతారంలో స్వామివారు

సారవకోట: అవలింగి జగన్నాథస్వామి రథయాత్రను పురస్కరించుకుని ఆరో రోజైన ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారిని గుడించా మందిరంలో పరశరామవతారంలో అలంకరించి స్వామి వారికి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు.


హిరమండలంలో..

హిరమండలం: మండల కేంద్రంలో జగన్నాథ స్వామి పరశురాం అవతారంలో భక్తులకు దర్శనిమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

తీరప్రాంత భౌగోళిక పరిస్థితిపై ఆరా

కవిటి:

రాష్ట్ర పర్యాటకశాఖ, మత్స్యశాఖ సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న తీరప్రాంత పర్యాటక అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు ఆదివారం కవిటి మండలంలో విస్తృతంగా పర్యటించారు. కళింగపట్నం, ఇద్దివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, కొత్తపాలెం, పుక్కళ్లపాలెం, సీహెచ్ కపాసుకుద్ది తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి స్థానిక స్థితిగతులపై ఆరా తీశారు. పర్యాటక, మత్స్యశాఖల కమిషనర్‌ల ఆదేశాల మేరకు ప్రొఫెసర్ డాక్టర్ పి.ఆనంద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి నడిమింటి నారాయణరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సంతోష్‌కుమార్, పీపీసీఎస్ డైరెక్టర్ కాయ భీమసేను, మాజీ వైస్ సర్పంచ్ ఆరంగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్ కపాసుకుద్ది తీరంలో అధికారులు

కరాటే పోటీల్లో సుజిత్ ప్రతిభ


పతకంతో సుజిత్

పొందూరు: అంతర్జాతీయ కరాటే పోటీల్లో పొందూరుకు చెందిన విద్యార్థి వడగా సుజిత్ ప్రతిభ కనబరిచాడు. అండర్-7 కేటగిరీ 20 కేజీల విభాంలో సుజిత్ కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 17, 18 తేదీల్లో న్యూఢిల్లీలోని తల్కోతరే ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న సుజిత్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ పోటీల్లో ఇండియా, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్, దుబాయ్, సౌత్ ఆఫ్రికా దేశాలు పాల్గొన్నాయి.

27న పాలపోలమ్మ గుడి వద్ద అన్నదానం

ఆమదాలవలస: పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 27వ తేదీన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కూన బాలకృష్ణ , సభ్యులు కె.శ్రీనివాసరావు, జి.కె.వెంకటేశ్వరరావు, శిల్లా మల్లికార్జునరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస పట్టణ కూరగాయలు, కిరాణా మార్కెట్ ప్రతినిధులు, పెద్దల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు ఇచ్చే కానుకల వివరాలను ఆలయం వద్ద నమోదు చేయించు కోవాలన్నారు.

30 మంది యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

సరుబుజ్జిలి: రేపటి ప్రయోజనం (ఆర్పీ) ఫౌండేషన్ తరఫున స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూట్యూబ్ స్టార్ ఎం.రమణ, ఆర్పీ ఫౌండేషన్ అధ్యక్షుడు బాన్న భార్గవ, కోశాధికారి వెలమల వెంకటరమణ, కార్యదర్శి ధవళ సింహాచలం, సభ్యులు నూక కిరణ్‌కుమార్, సంతోషి, దాలిరాజు, రామ్‌శంకర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యా సామగ్రితో విద్యార్థులు

పొందూరు: కొంచాడ గ్రామంలో దికింగ్ జీసస్ పవర్ టెంపుల్‌లో ఆదివారం ద రైట్ వే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంట వసంత కుమార్ విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. 6, 7, 8 తరగతులు చదువుతున్న 70 మందికి అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్, షార్పనర్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల అనూరాధ, ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, నాయకులు చింతాడ శివకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పొందూరు: స్థానిక జాలీవాకర్స్ క్లబ్ సభ్యులకు ఆదివారం ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. జెన్‌కో మాజీ డైరెక్టర్ బాషా ఆనంద్‌మోహన్ ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ విజయభాస్కర్, లాబ్ టెక్నీషియన్ రమేష్‌ల సహకారంతో 45 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. అల్లంశెట్టి కృష్ణారావు, రజని దంపతులు క్లబ్ సభ్యులకు అల్పాహారం అందించారు.

ఏటిమగ నుంచి రక్షణ కల్పించాలి


తీరప్రాంతంలో ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మత్స్యకారులు

శ్రీకాకుళం రూరల్: పెదగనగళ్లవానిపేట తీర ప్రాంతంలో ఏటి మగ నుంచి తమకు రక్షణ కల్పించాలని మాజీ సర్పంచ్ చీకటి గురుమూర్తి ఆధ్వర్యంలో మత్స్యకారులు కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా తీరప్రాంతం కోతకు గురవుతోందన్నారు. మత్స్యకారుల వలలు, బోట్లు, తెప్పలు ప్రమాదానికి గురవుతున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో రక్షణ గోడ కట్టాలని గత పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రక్షణ గోడ నిర్మించాలని కోరారు. అనంతరం మంత్రి స్పందిస్తూ ఉన్నతాధికారులతో మట్లాడి ప్రస్తుతం జేసీబీలతో గండి కొట్టి నేరుగా నీటిని సముద్రంలోకి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సంబంధించి శాఖాధికారులతో మాట్లాడి రక్షణ గోడకు ఎస్టిమేషన్ వేసి త్వరితగతిన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

వీల్‌చైర్ క్రికెట్‌లో లక్ష్మణరావు ప్రతిభ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుతో లక్ష్మణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశం పంచాయతీకి చెందిన దాని లక్ష్మణరావు వీల్ చైర్ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనతో సత్తాచాటు తున్నారు. రాష్ట్ర వీల్ చైర్ క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ఛత్తీస్‌గఢ్ మైత్రీ వీల్ చైర్ క్రికెట్ పోటీలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగాయి. పోటీల్లో ఛత్తీస్‌గఢ్, ఏపీ, మహారాష్ట్ర, గుజరాత్ జట్లు పాల్గొనగా.. రాష్ట్ర జట్టు రన్నర్‌గా నిలిచింది. ఏపీ జట్టు తరఫున లక్ష్మణరావు 39 బంతుల్లో 83 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికై రూ.21 వేలు అందుకున్నాడు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళ నగదును కృష్ణమాచార్యులుకు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బలగకు చెందిన వాడిగి మురళీ, కల్పన దంపతులు రూ.లక్ష నగదును విరాళంగా ఆదివారం అందజేశారు. తన తండ్రి వాడిగి రామారావు జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేస్తున్నట్లు దాత ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది చక్రవర్తి, నేతేటి హరిప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి టి.చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కళాశాలల గెస్ట్ ఫ్యాకల్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బదిలీల్లో ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అనంతరం భవిష్యత్ కార్యచరణపై ప్రణాళిక రూపొందించారు. సమావేశంలో గెస్ట్ ఫ్యాకల్టీలు రామారావు, జగన్, పార్వతి, ప్రసన్న, లలితాబాయి, తరుణ్, వెంకట్, కసవయ్య, మల్లేశ్వరరావు, సత్యనారాయణ, తిరుమల, శివాజీ తదితరులు పాల్గొన్నారు.